క్లుప్తంగా

ఎంపీడీఓ, ఎంపీఓల బాధ్యతల స్వీకరణ


మాధవి, నర్సింహులపేట


విజయ, మరిపెడ

నర్సింహుల పేట: నర్సింహులపేట నూతన ఎంపీడీఓగా బుధవారం కె.మాధవి విధుల్లో చేరారు. ఇక్కడ పని చేసిన ఎంపీడీఓ శ్రీనువాస్ బదిలీపై భద్రాచలానికి వెళ్లారు. నూతన ఎంపీఓగా కిన్నెర యాకయ్య బాధ్యతలు స్వీకరించారు.

మరిపెడ: మరిపెడ ఎంపీడీఓగా పి.విజయ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఎంపీఓగా సోంలాల్ నాయక్ బాధ్యతలు స్వీకరించారు.

తొర్రూరు: తొర్రూరు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా వై.పూర్ణచందర్‌రెడ్డి నియమితులయ్యారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. మరిపెడలో ఎంపీఓగా పని చేసిన ఆయన తొర్రూరు ఎంపీఓగా బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఎంపీడీఓగా పని చేసిన సిలార్ సాహెబ్ ఖమ్మం జిల్లాకు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో ఎంపీఓ పూర్ణచందర్‌రెడ్డికి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగించారు.

ఎంపీఓలు..

కురవి/గార్ల: కురవి ఎంపీఓగా మహమూద్ గౌస్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేసిన విజయలక్ష్మి గార్ల మండలానికి బదిలీపై వెళ్లారు.

నెల్లికుదురు: మండల ఎంపీఓగా బి.పద్మ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీఓగా పనిచేసిన బందారు పార్థసారథి పెద్దవంగరకు బదిలీపై వెళ్లారు.

ఎస్పీని కలిసిన ఎస్సైలు

మహబూబాబాద్ రూరల్: ఇటీవల విధుల్లో చేరిన బయ్యారం, కొత్తగూడ ఎస్సైలు తిరుపతి, కుశకుమార్ జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బొకే, పూల మొక్క అందజేశారు. నెల్లికుదురులో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఏఎస్సైగా పదోన్నతి పొందిన వి.వెంకట్ రెడ్డి, జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఏఎస్సైగా పదోన్నతి పొందిన ఎస్.శ్రీనివాస్ ఎస్పీని కలిసి బొకే అందజేశారు.

చెక్కుల పంపిణీ

బయ్యారం: ఎమ్మెల్సీ, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ సహకారంతో మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ బిందు బయ్యారంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు సత్యనారాయణ, యూత్‌విభాగం మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, ఎంపీటీసీ కవితశ్రీనివాస్, నాయకులు సంపత్, యాకయ్య, సతీష్ పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



దంతాలపల్లి: మండల కేంద్రంలోని గిరిజన బాలుర వసతి గృహాన్ని బుధవారం తహసీల్దారు శ్రీనివాస్‌రావు పరిశీలించారు. వసతి గృహం పరిసర ప్రాంతాలను, విద్యార్థులకు భోజనం ఎలా పెడుతున్నారని ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వసతిగృహంలో మురుగు నీరు నిల్వకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వివేక్‌రామ్, ఆర్‌ఐ నజీముద్దీన్, ఎంపీఓ అప్సర్‌పాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్



మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని ముత్యాలమ్మగూడెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈవీఎం, ఓటింగ్ విధానం, కౌటింగ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం యాకలక్ష్మి, వార్డెన్ తాటి జయసుధ, సీనియర్ ఉపాధ్యాయులు రాము, భాగ్యమ్మ, మొగులయ్య, రమేష్, శారద పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి

కొత్తగూడ: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ట్రాన్స్‌కో డీఈ విజయ్ సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో కొత్తగూడ, గంగారం మండలాల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వర్షాకాలం విద్యుత్ సరఫరా సమస్యలు తలెత్తకుండా సిబ్బంది అందుబాటులో ఉండాలని అన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు ప్రజలు వెళ్లి మరమ్మతులు చేయకుండా చూసుకోవాలని అన్నారు. సమావేశంలో ఏడీఈ కవిత, ఏఏఓ రమేశ్, ఏఈ సురేష్, సబ్ ఇంజనీర్ అనిల్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లు ఇలా.. వెళ్లడం ఎలా?

కురవి: మండలంలోని కొత్తూరు(జీ) శివారు బంచరాయి తండాలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు వరకు రోడ్డు బురదమయంగా మారింది. లిఫ్ట్ వద్దకు, చుట్టు పక్కల ఉన్న పొలాలు, చేల వద్దకు వెళ్లాల్సిన రైతులు బురదరోడ్డుపై నడవలేని పరిస్థితిలో ఉన్నారు. బురదలో నడవాలంటే నరకాన్ని అనుభవిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో బంచరాయి తండా నుంచి లిఫ్ట్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ఎస్డీఎఫ్ నిధులు రూ.80 లక్షలు మంజూరు చేశారు. 2023 అక్టోబర్ 4వ తేదీన అప్పటి ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి నేటి వరకు లిఫ్ట్‌కు వెళ్లే మార్గంలో పనులు పూర్తి కాలేదు. దీంతో రైతులు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఆధారంగా అక్కడి రైతులు పంటలను సాగు చేస్తున్నారు. వర్షాకాలం కావడం, ఇటీవల వరుసగా వర్షాలు కురుస్తుండడంతో రోడ్డంతా బురదమయంగా మారిపోయింది. సకాలంలో పూర్తి కావాల్సిన పనులు పెండింగ్‌లో పడిపోవడంతో అధికారులు పట్టించుకున్న పాపనపోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బీటీ రోడ్డు పనులు మొదలు పెట్టి త్వరితగతిన పనులు పూర్తి చేసి రైతుల బాధలు తీర్చాలని కోరుతున్నారు.


కురవి: బురదమయంగా మారిన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు వెళ్లే రోడ్డు

గుండెపుడి గ్రామంలో..

మరిపెడ రూరల్: మరిపెడ మండలం గుండెపుడి గ్రామంలో అంతర్గత రహదారులన్నీ బురదమయంగా మారాయి. దీంతో బురదలో నడవలేక గ్రామస్తులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఏ మాత్రం వర్షం పడిన రోడ్లన్నీ బురదమయంగా మారి, దోమలకు ఆవాసులుగా మారుతున్నాయి. దీంతో జ్వరాల బారిన పడే అవకాశం ఉందని గుండెపుడి గ్రామమస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.


మరిపెడ రూరల్: గుండెపుడి గ్రామంలో..

పనులు వెంటనే ప్రారంభించాలి



తండా నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి. రోడ్డు మీద నడవాలంటే ఇబ్బందిగా ఉంది. తక్షణమే కాంట్రాక్టర్, అధికారులు స్పందించి పనులు మొదలయ్యేలా చర్యలు తీసుకోవాలి.

\- దేవేందర్, బంచరాయి తండా, కురవి

బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

మహబూబాబాద్ రూరల్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్‌లో తెలంగాణకు అరకొర నిధులు కేటాయించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షులు కమ్మగాని కృష్ణమూర్తి, రాములునాయక్, హన్మంతు పాల్గొన్నారు.

గిరిజనులకు అన్యాయం

కురవి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గిరిజన సంక్షేమానికి నిధులు వెచ్చించలేదని, గిరిజనులకు అన్యాయం చేశారని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మాలోత్ కిషన్ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో అన్నారు.

కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం

గార్ల: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మరోసారి మొండిచేయి చూపడాన్ని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం గార్లలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జంపాల వెంకన్న, పోతుల నర్సింహారావు, భీముడు, తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: మాట్లాడుతున్న శంతన్ రామరాజు

కేసముద్రం: రాష్ట్రానికి బడ్జెట్ కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మోసగించిందని సీపీఐ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్, మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ బుధవారం మండల కేంద్రంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు లింగస్వామి, దల్వాయి కిషన్‌రావు, భాస్కర్ పాల్గొన్నారు.

తొర్రూరు: బడ్జెట్‌లో కేటాయింపులు లేకుండా తెలంగాణకు కేంద్రం అన్యాయం చేసిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఓమ భిక్షపతి, మండల కార్యదర్శి బందు మహేందర్ అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలో బడ్జెట్ పత్రాలను దహనం చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

కేసముద్రం: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ శ్రేణులు సత్తా చాటాలని బీజేపీ మండల అధ్యక్షుడు పాదిల నర్సింహరెడ్డి, పార్టీ జిల్లా కోశాధికారి వోలం శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలు గుర్తించి, మూడోసారి కేంద్రంలో బీజేపీకి అధికారం కట్టబెట్టారన్నారు. గ్రామాల్లో బీజేపీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను తెలియజేస్తూ, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు మెంబర్, సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో విజయం సాధించే దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రడం వెంకన్న, కొమ్మాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాగేశ్వరాచారి, మధు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రైతులనుంచి డబ్బులు వసూలు చేయొద్దు

నర్సింహులపేట: రుణమాఫీ జరిగిన రైతుల నుంచి పీఏసీఎస్‌లో అక్రమ వసూళ్లకు పాల్పడితే శాఖ పరమైన చర్యలు తప్పవని ఉమ్మడి వరంగల్ ఏజీఎం కృష్ణమోహన్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంత మంది రైతులకు రుణమాఫీ జరిగింది, ఇంకా ఎందరు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. రుణమాఫీ అయిన రైతుల నుంచి వడ్డీ డబ్బులు మాత్రమే వసూలు చేయాలన్నారు.

బిల్డింగ్ కార్మికులను ఆదుకోవాలి

మరిపెడ: బిల్డింగ్ కార్మికులకు ఆర్థికసాయం అందించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు దుండి వీరన్న డిమాండ్ చేశారు. బుధవారం మరిపెడలో ఆయన మాట్లాడుతూ.. బిల్డింగ్ కార్మికులకు ప్రమాదం జరిగితే సంక్షేమ బోర్డు నుంచి రూ.15వేలు ఇచ్చేవారని, కాని ఇప్పుడు దరఖాస్తు చేస్త పథకం లేదని అధికారులు చెబుతున్నారన్నారు. పథకాన్ని వెంటనే అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నందిపాటి వెంకన్న, కొండ ఉప్పలయ్య, బండ వీరస్వామి, యాదగిరి, ముత్తయ్య, ఎల్లయ్య, రాములు, వెంకన్న పాల్గొన్నారు.

దేశం గర్వించే నాయకుడు కేటీఆర్


మహబూబాబాద్ అర్బన్: కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి


తొర్రూరులో కేక్‌కట్ చేస్తున్న దయాకర్‌రావు

మహబూబాబాద్ అర్బన్/తొర్రూరు/బయ్యారం/డోర్నకల్/పెద్దవంగర/గూడూరు: దేశం గర్వించే నాయకుడు కేటీఆర్ అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కొనియాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో దయాకర్‌రావు కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్ నాయకత్వ పటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.

రహదారిపైనే పార్కింగ్..!

మండల కేంద్రంలోని ప్రధాన బస్టాండ్ సెంటర్ జాతీయ రహదారి పక్కనే యూనియన్ బ్యాంకు ఎదుట ఖాతాదారులు పక్కనే జాతీయ రహదారి ఉందని తెలిసిన వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. వాహనాల పార్కింగ్‌తో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. - గూడూరు


జాతీయ రహదారిపై పార్కింగ్ చేసిన వాహనాలు

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న పీరయ్య

నెహ్రూసెంటర్: గ్రామస్థాయి నుంచి ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేసేందుకు కమిటీలను ఏర్పాటు చేస్తూ గ్రామగ్రామాన సంఘం జెండాలు ఎగురవేయాలని సంఘం జిల్లా కోఆర్డినేటర్ గుగ్గిళ్ల పీరయ్యమాదిగ పిలుపునిచ్చారు. జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల విస్తృత స్థాయి సమావేశం బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడే లోపే పూర్తిస్థాయిలో సంఘాల నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. గ్రామాలు, మండలాల్లో నూతన కమిటీలపై దృష్టిసారించి సంఘం బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.పాష, శ్రీను, భిక్షపతి, ప్రవీణ్, రజియా, సుమిత్ర పాల్గొన్నారు.

చంద్రశేఖర్ మరణం తీరనిలోటు

గంగారం/తొర్రూరు/పెద్దవంగర: దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన కమ్యూనిస్టు నేత రాయల చంద్రశేఖర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన సంతాప సభలు ఆయా మండల కేంద్రాల్లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రజాపోరాటాల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు చంద్రశేఖర్ అన్నారు. దళితులు, గిరిజనులు, అట్టడుగు వర్గాల ప్రజల కోసం పోరాడిన చంద్రశేఖర్ మరణం ప్రజలకు తీరనిలోటని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న, జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, తొర్రూరు డివిజన్ కార్యదర్శి మంజపల్లి వీరన్న, నాయకులు భిక్షం, కురుసం, రంగయ్య, వెంకటేశ్వర్లు, నవీన్, రాజేశ్వరెడ్డి పాల్గొన్నారు.


తొర్రూరు: నివాళులర్పిస్తున్న నాయకులు

డ్రైవర్ల అప్రమత్తతతో ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న ఎస్సై ఉపేందర్

తొర్రూరు: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు ఆర్టీసీ డ్రైవర్లు కృషి చేయాలని పెద్దవంగర ఎస్సై జి.ఉపేందర్ అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ప్రమాద రహిత వారోత్సవాలు నిర్వహించారు. డీఎం పద్మావతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎస్సై మాట్లాడారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, డ్రైవర్లు అప్రమత్తత పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమన్నారు. కార్యక్రమంలో ఏఈ విజయ్, ఎస్‌టీఐ రజిత, కంట్రోలర్ ఆర్ఎస్ కుమార్, సూపరింటెండెంట్ మల్లయ్య, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయిస్తాం

పెద్దవంగర: అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయిస్తామని తహసీల్దార్ వీరగంటి మహేందర్ అన్నారు. బుధవారం మండలంలోని టీక్యాతండా, మోత్యా తండా, పెద్దవంగర, ఉప్పరగూడెం గ్రామాల్లోని డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వేణుమాధవ్, నీటిపారుదల శాఖ డీఈ పూర్ణచందర్, ఏఈ స్వాతి, ఏఈఈ లక్ష్మీలు పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో డబుల్ బెడ్రూం ఇళ్లను బుధవారం ఎంపీడీఓ వివేక్‌రామ్ పరిశీలించారు. త్వరగా నిర్మాణాలు పూర్తిచేసి లబ్ధిదారులకు అందివ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ అప్సర్‌పాషా, కార్యదర్శి వెంకన్న పాల్గొన్నారు.


నెల్లికుదురు: ఇళ్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ

నెల్లికుదురు: మండలంలోని నైనాల, జామతండా, బ్రాహ్మణకొత్తపల్లి, నెల్లికుదురు గ్రామాల్లో చేపడుతున్న డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను బుధవారం ఎంపీఓ బి.పద్మతో కలిసి ఎంపీడీఓ బాలరాజు పరిశీలించారు.

బురదలో నాటు వేసి నిరసన

మండల కేంద్రం బీసీ కాలనీలో కొద్దిపాటి వర్షానికే రోడ్డు బురదమయంగా మారిపోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం బురద రోడ్డులో నాటు వేసి నిరసన తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతుల చేయాలని కాలనీ వాసులు కోరారు. - దంతాలపల్లి


నాటు వేసి నిరసన తెలుపుతున్న మహిళలు

సంక్షిప్త సమాచారం

సృజనాత్మకతను వెలికితీయాలి

మహబూబాబాద్: పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అక్షరభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కౌన్సిలర్ స్వాతి, గోపి, శంకర్, కిరణ్ పాల్గొన్నారు.

ఆత్మీయ వీడ్కోలు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని నందమూరి నగర్‌లో బదిలీపై వెళ్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు హెచ్‌ఎం బాల్య, అనిత, సాయికృష్ణను మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కౌన్సిలర్ అజయ్‌సారథి, బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోవర్ధన్, ఉపాధ్యాయులు మహేశ్వరి, రఘు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక నిధులు కేటాయించాలి

కొత్తగూడ: ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయించాలని తుడుందెబ్బ రాష్ట్ర సంస్కృతిక కార్యదర్శి ఆగబోయిన రవి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

సన్మానం

మహబూబాబాద్ అర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎం కిషన్‌నాయక్ ఇటీవల పదోన్నతి పొందిన క్రమంలో ఆయన నివాసంలో బుధవారం టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గాడిపల్లి శ్రీహరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

నర్సింహులపేట: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ తొర్రూరు డివిజన్ కార్యదర్శి గొడిశాల మనోజ్ డిమాండ్ చేశాడు. బుధవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. మండల కేంద్రం నుంచి ఇంటర్, డిగ్రీ విద్యార్థులు 30కిలోమీటర్ల దూరం వెళ్లి చదువుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉడుత వేణు, వెలిశాల సిద్దు, వంశీ, రాజు, నవీన్, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

నాయకులను విడుదల చేయాలి

గార్ల: విద్యారంగానికి బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బుధవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న పీడీఎస్‌యూ నాయకులను వెంటనే విడుదల చేయాలని సంఘం మండల కార్యదర్శి ఎం.మహేష్‌కుమార్ బుధవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు.

బెల్లయ్యనాయక్‌ను కలిసిన వెంకట్ నాయక్



మహబూబాబాద్ రూరల్: రాష్ట్ర ఎస్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన తేజావత్ బెల్లయ్య నాయక్‌ను హైదరాబాదులోని ఆయన కార్యాలయంలో టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోత్ వెంకట్ నాయక్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ఆర్టీసీ బస్సుకు ఘనస్వాగతం



డోర్నకల్: తమ గ్రామం నుంచి చిలుకోడు శివారు మోడల్ స్కూల్‌కు ప్రారంభమైన ఆర్టీసీ బస్సుకు బుధవారం సీరోలు మండలం చిలుకొయ్యలపాడు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. గతంలో చిలుకోయ్యలపాడుకు చెందిన విద్యార్థులు మన్నెగూడెం వరకు 4కిలోమీటర్లు నడిచి మోడల్ స్కూల్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులో ప్రయాణించే వారు. కార్యక్రమంలో వెంకన్న, శ్రీనివాస్‌యాదవ్, ఉప్పలయ్య పాల్గొన్నారు.

ఆలయానికి ఎలక్ట్రికల్ డ్రమ్ బహూకరణ

గార్ల: మర్రిగూడెం వేట వేంకటేశ్వరస్వామి ఆలయానికి పూరే సత్యనారాయణ, సంధ్య దంపతులు బుధవారం ఎలక్ట్రికల్ డ్రమ్స్ బహూకరించారు. అనంతరం ఆలయంలో పూజలు చేశారు.

రెడ్డి జాగృతి రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి

కేసముద్రం: రెడ్డి జాగృతి రాష్ట్ర కార్యదర్శిగా కేసముద్రంవిలేజ్‌కి చెందిన సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఎన్నికయ్యాడు.

సైడ్ కాల్వలు నిర్మించాలి

డోర్నకల్: సైడు కాల్వలు నిర్మించాలని కోరుతూ 11వ వార్డు వాసులు బుధవారం మున్సిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి, చైర్మన్ వాంకుడోత్ వీరన్నకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రెడ్డెబోయిన శంకర్, శీలం శ్రీనివాస్, స్థానికులు వీరభద్రం, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన ఉద్యమకారులు

నెల్లికుదురు: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నెల్లికుదురు ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన చిర్ర రమేష్ బాబును బుధవారం ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు బొర్రాజు లింగన్న,నరేష్, వినయ్, హరీశ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఔషధ మొక్కలపై అవగాహన

దంతాలపల్లి: మండలకేంద్రంలోగల జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థులకు ఔషధ మొక్కలపై బుధవారం హెచ్‌ఎం వేణుమాధవరెడ్డి బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీజేఆర్ జిల్లా బాధ్యులు శంకర్, ఫిజికల్ డైరెక్టర్ ఎనుగండ్ల నాగిరెడ్డి, ఉపాధ్యాయుడు సురేందర్‌గుప్తా పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ పలు కళాశాలలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీను, బాలు, నవీన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ఎస్ఎఫ్ఐ శిక్షణ తరగతులు

మహబూబాబాద్ అర్బన్: నేటి నుంచి మానుకోట జిల్లా కురవి మండల కేంద్రంలలో ఎస్ఎఫ్ఐ జిల్లా విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు బుధవారం పిలుపునిచ్చారు.

జ్వర సర్వే

నెహ్రూసెంటర్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్ సూచించారు. జిల్లా కేంద్రంలోని కృష్ణకాలనీ సబ్ యూనిట్ పరిధిలో టీకాల కార్యక్రమం, ఇంటింటి జ్వర పీడితుల సర్వే బుధవారం చేపట్టారు.

బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలి



నెహ్రూసెంటర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణలోని ఉమ్మడి వరంగల్, మహబూబాబాద్ జిల్లాలకు నిధులు తేవడంలో బీజేపీ 8 మంది ఎంపీలు విఫలమయ్యారని, వారు రాజీనామా చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథిరెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాపై కక్షపూరిత వివక్ష కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని నెహ్రూసెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను బుధవారం దహనం చేశారు. విభజన హామీ బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై కేంద్రం మాట్లాడకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథి రెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, వెంకన్న, సాంబలక్ష్మీ పాల్గొన్నారు.


మత్తడి పోస్తున్న ఆకేరు వాగు చెక్‌డ్యాం

అకేరు వాగు మత్తడి..

మండలంలోని ఆకేరు వాగు చెక్ డ్యాం నిండి వాగు స్వల్పంగా ప్రవహిస్తోంది. విస్తారంగా వర్షాలు కురవడంతో ఆకేరు మత్తడి పోయడం ద్వారా చుట్టు పక్కల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. - చిన్నగూడూరు